13

# క్రీస్తు యొక్క బానిసలు

"అయినను ఇప్పుడు పాపమునుండి విమోచింపబడి దేవునికి దాసులైనందున పరిశుద్ధత కలుగుటయే మీకు ఫలము; దాని అంతము నిత్యజీవము" (రోమా 6:22).

కొన్ని సంవత్సరాల క్రిందట కాలిఫోర్నియాలోని, మోడెస్టోలో వరుసగా సువార్త ప్రసంగాలను చేస్తూ ఉన్నాను. నా కుటుంబం నాతోకూడ ఉంది, మీటింగుల రెండు రోజులు ఒక క్రైస్తవ కుటుంబం మమ్మును తమ యింట చేర్చుకుంది. నన్ను సూసన్‌న్ను విశాలమైన మంచి పడక గదిలో ఉంచారు. వారితో గడిపిన రెండవ దినం బహు విరామం లేకుండ ఉంది. ఆ రాత్రి కార్యక్రమం ముగించి పది గంటలయ్యేవరకు నా దినచర్య వ్యాయామానికి సమయం లేకుండాపోయింది. ఒక గంటసేపు నడిచిన తరువాత యింటికి చేరుకునే సమయానికి చాలా లేటయ్యింది. మా గదిలో తప్ప మిగిలిన లైట్స్ అన్ని ఆరిపోయాయ్. మాకు ఆతిథ్యం చేసే దంపతులు నా కొరకు ఆ గదికి తాళం వేయకుండ వెళ్లారు, గనుక మా పడక గదికి వెళ్లడానికి అనుకూలంగా ముఖ ద్వారం తెరువబడి ఉంది. నేను లోపలగుండా వెళ్లుతుంటే లివింగ్ రూమును బెడ్ రూముగా మార్చుకున్నట్లు నేను కనుగొనక తప్పలేదు. వాలు కుర్చీ బెడ్‌గా చేయబడింది. మాకు ఆతిథ్యం యిచ్చిన దంపతులు వాలు కుర్చీమీద నిద్రపోతున్నారు. ఆ యిద్దరు క్రైస్తవులు నిజమైన సేవకులని నాకు తట్టింది. శ్రేష్ఠమైన వారి పడక గదిని మాకిచ్చారు, వారు తాత్కాలికంగా లివింగ్ రూమును పడకకు అనుకూలంగా మార్చుకున్నారు! క్రైస్తవ ఆలోచననుబట్టి మమ్మును ప్రధానంగా ఎంచుకున్నారు తమను కడపట పెట్టుకున్నారు!

క్రొత్త నిబంధన ప్రకారం, ఈ దంపతులు సంఘంయొక్క అత్యల్పమైన రూప చిత్రమై యున్నారు. రాజులు రాణులు సంఘాన్ని సూచించారు, సేవకులు సూచిస్తారు! సంఘమునకు శిరస్సైయున్న మన రక్షకుడు యిలా అన్నాడు, "... మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీ పరిచారకుడై యుండవలెను; మీలో ఎవడు ముఖ్యుడై యుండగోరునో వాడు మీ దాసుడై యుండవలెను. అలాగే మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము నిచ్చుటకును వచ్చెనని చెప్పెను" (మత్తయి 20:27, 28). క్రీస్తుయొక్క అనుచరులను గూర్చి పౌలు యిలా వ్రాయడంలో ఆశ్చర్యము లేదు, "కక్షచేతనైనను వృథాతిశయముచేతనైనను ఏమియు చేయక, వినయమైన మనస్సు గలవారై యొకనినొకడు తనకంటె యోగ్యుడని యెంచుచు మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమేగాక యితరుల కార్యములను కూడ చూడవలెను" (ఫిలిప్పీ. 2:3, 4). పేతురుకూడా క్రీస్తు సంఘాన్ని యిలా హెచ్చరించాడు, "స్వతంత్రులైయుండియు

దుష్టత్వమును కప్పి పెట్టుటకు మీ స్వాతంత్ర్యమును వినియోగపరచక, దేవునికి దాసులమని లోబడియుండుడి” (1 పేతురు 2:16).

క్రీస్తు సేవకుల యొక్క సముదాయంగా సంఘమును మనం చూడనియెడల, అధికార పూర్వకమైన క్రీస్తు సంఘ స్వభావముయొక్క కీలక విషయాన్ని మనం పోగొట్టుకుంటాం. సంఘ జీవితమనే భావనతో సేవాతత్వం మిళితం చేయబడింది. సంఘ స్థాపకుడును, శిరస్సునైయున్న క్రీస్తుతో ఈ ఆలోచన ఆరంభమై ప్రతి సభ్యునికి అది ప్రమాణంగా నిలిచింది. క్రీస్తు సంఘమని చెప్పుకునే ఏదైనా దైర్యంతోకూడిన సేవాతత్వంతో తన జీవితాన్ని ఈ లోకంలో తేటగా చూడలేకుంటే తనది కాని పరిస్థితిని తనదైనట్టు చెప్పు కొంటుంది.

సంఘానికి ఈ గుణం అతి ప్రాముఖ్యమైనదైనందున, క్రీస్తు సంఘమైయున్న మనం ఎలా క్రీస్తు సేవకులమైయున్నామో బహు జాగ్రత్తగా ఆలోచింప బద్ధులమై ఉన్నాం.

## డెసిగ్నేషన్‌లో

మొదట, మన డెసిగ్నేషన్‌లోనే మన పాత్రను మనం చూస్తాం. సంఘంకొరకు వినియోగింపబడిన వర్ణనవలన సంఘము క్రీస్తు సేవకులచేత నిర్మింపబడిందని క్రొత్త నిబంధన సూచిస్తుంది. తన ప్రజలు సేవకులై ఉండాలని ప్రభువు కోరుకున్నట్టు విదితమైయుంది, లేకుంటే తన సంఘాన్ని క్రీస్తు ప్రభువు అలా వర్ణించి యుండేవాడు కాదు.

తన అనుచరుల మధ్య నిజమైన గొప్పతనాన్ని ఆయన నిర్వచించాడు: “అన్యజనులలో అధికారులు వారిమీద ప్రభుత్వము చేయుదురనియు, వారిలో గొప్పవారు వారిమీద అధికారము చేయుదురనియు మీకు తెలియును. మీలో అలాగుండకూడదు; మీలో ఎవడు గొప్పవాడై యుండగోరునో వాడు మీ పరిచారకుడై యుండవలెను” (మత్తయి 20:25, 26). గొప్పతనమంటే, ప్రభువు ప్రకారం, సేవచేసే దానినిబట్టియే గాని, కలిగియున్న సంపదనుబట్టియో, లేక చేతపట్టిన పదవులనుబట్టియో కాదు.

క్రీస్తులోనికి మార్చబడడంలో, పాపి దేవునియొక్కయు క్రీస్తుయొక్కయు సేవకుడౌతాడని పౌలు చిత్రించాడు. మార్పుకు ముందు, మనం పాపమునకు దాసులం, అయితే మారినతోడనే, మనము నీతికి దాసులం (రోమా 6:17, 18). క్రైస్తవులు తమకు తాము చెందినవారును కారు, వారు దేవుని ప్రత్యేకమైన వ్యక్తిగతమైన సొత్తుగా మారిపోతారు: “విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహములతో దేవుని మహిమపరచుడి” (1 కొరింథీ. 6:20). మనం చనిపోయినా, బ్రదికినా ప్రభువువారమే: “మనలో ఎవడును తన కోసమే బ్రతుకడు, ఎవడును తన కోసమే చనిపోడు. మనము బ్రదికినను ప్రభువు కోసమే బ్రదుకుచున్నాము; చనిపోయినను ప్రభువు కోసమే చనిపోవుచున్నాము. కాబట్టి మనము బ్రదికినను చనిపోయినను ప్రభువువారమై యున్నాము” (రోమా 14:7, 8).

మనము దేవునికిని క్రీస్తుకును సేవకులమై ఉన్నామనే భావన ఒకరికొకరం చేసికొనే సేవలో సహజంగా కన్పిస్తుంది. “క్రీస్తునందలి భయముతో ఒకనికొకడు లోబడి యుండుడి” (ఎఫెసీ. 5:21) అని మనం చెప్పబడిన ప్రకారం, మన సొంత మార్గమును డిమాండ్

చేయకుండ, మన సహోదరుని యొక్క క్షేమము మరియు ఆత్మసంబంధమైన జీవితాన్ని ఎల్లవేళలా ఆలోచన చేయాలి. పౌలు యిలా వ్రాశాడు, "నీ సహోదరుడు నీ భోజన మూలముగా దుఃఖించినయెడల నీవికను ప్రేమ కలిగి నడుచుకొనువాడవు కావు. ఎవనికొరకు క్రీస్తు చనిపోయెనో వానిని నీ భోజనముచేత పాడుచేయకుము ... ఈ విషయమందు క్రీస్తునకు దాసుడైనవాడు దేవునికి ఇష్టుడును మనుష్యుల దృష్టికి యోగ్యుడునై యున్నాడు" (రోమా 14:15, 16). గనుక, క్రీస్తుయొక్క సేవకులుగా "సహోదర ప్రేమ విషయములో ఒకనియందొకడు అనురాగముగలవారై, ఘనత విషయములో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి" (రోమా12:10). "సహోదరులారా, మీరు స్వతంత్రులుగా ఉండుటకు పిలువబడితిరి. అయితే ఒక మాట, ఆ స్వాతంత్ర్యమును శారీరక్రియలకు హేతువు చేసికొనక, ప్రేమకలిగినవారై యొకనికొకడు దాసులైయుండుడి" అని కూడా మనం ఆజ్ఞాపించబడ్డాం (గలతీ. 5:13).

క్రీస్తు సేవకులు ఈ లోకంలో ఆయన ఆజ్ఞాపించినది జరిగించడానికి ఉన్నారు. వారు ఆయన సువార్తను ప్రకటిస్తారు, తమది కాదు; ఆయన పనిని నెరవేర్చ వెదకుతారు, తాము ఏర్పరచుకున్నది కాదు. పౌలుతో వారు యిలా చెప్పుతారు, "ఇప్పుడు నేను మనుష్యుల దయను సంపాదించుకొన జూచుచున్నానా దేవుని దయను సంపాదించుకొన జూచు చున్నానా? నేను మనుష్యులను సంతోషపెట్టగోరుచున్నానా? నేనిప్పటికిని మనుష్యులను సంతోషపెట్టువాడనైతే క్రీస్తు దాసుడను కాకయే పోవుదును" (గలతీ. 1:10).

మహా అలెగ్జాండరు సైన్యంలోని ఒక సైనికుని కథ చెప్పబడింది. ఆ యౌవన సైనికుని యొక్క మొదటి పేరు అలెగ్జాండర్. అతనిపై దోషారోపణ చేయబడింది, అలెగ్జాండరుయొక్క మహా బలీయమైన సైన్యంలో అలాటి గుణానికి తావుండదు. అతని దోషం కనుగొనబడింది, తీర్పు కొరకు అతడు రాజు వద్దకు తేబడ్డాడు. మహా అలెగ్జాండరు అతని పేరేమని అడిగాడు. ఆ సైనికుడు నెమ్మదిగా "అలెగ్జాండరని" చెప్పాడు. ఆ మహా అలెగ్జాండరు అతని వైపు తీక్షణంగా చూచి, "సైనికుడా, నీ జీవితమైనా మార్చుకో లేదా నీ పేరైనా మార్చుకో!" అని చెప్పాడట.

దేవుని పరిశుద్ధాత్మచే సంఘానికి ఒక డెసిగ్నేషన్ పెట్టబడింది. ఇంతకు "క్రీస్తు కోరినట్టు సంఘం లోకంలో ఉండడం ఎలా?" అనే ప్రశ్నకు తీర్మానంతో ముగించిన జవాబు లేఖనాల్లో ఉంది: "నీ పేరుకు తగినట్టు బ్రతుకు! దేనికి పిలువబడ్డావో అలా ఉండు. క్రీస్తు యొక్క సేవకులై యుండుడి."

విన్‌స్టన్ చర్చిల్ యిలా అన్నాడు, "ఒకనిలో సుగుణ శీలాన్ని పుట్టించాలంటే, ఆ సుగుణ శీలాన్ని వానికి ఆరోపించడమే శ్రేష్ఠమైన మార్గం." సేవకత్వమనే సుగుణాన్ని దేవుడు తన ప్రజలకు ఆరోపించి మనలను ఆయన సేవకులని పిలుస్తూ, సేవకత్వపు స్వభావాన్ని ఆయన మన మనస్సుల్లో నిలుపుతున్నాడు.

వాస్తవంగా, మనం సేవకులం కాకముందు, సేవకులు ఆలోచించినట్లు ఆలోచింప వలసి ఉంటుంది. సేవకుని యొక్క ఆలోచనను ఆచరణలో పెడదాం. "దీనిలోనుండి నాకేమి వస్తుంది?" అని అడగకుండ, "నేను నా సహోదరునికి ఎలా సహాయపడగలను?

క్రీస్తునందు ఎదిగించడానికి, విశ్వాసమందు బలవంతునిగా చేయడానికి అతనికి అధికంగా కావలసిందేమి?” అని అడుగుదాం. “ప్రభువా, యిటీవల నా కొరకు ఏమి చేశావ్?” అని అడగకుండ, “ప్రభువా నేనిక్కడ ఉన్నా, నన్ను పంపుము” అని అడుగుదాం!

## కోరికలో

మనం డెసిగ్నేషన్‌లో మాత్రమే క్రీస్తు సేవకులం గాక, కోరికలో కూడ సేవకులమై యుండాలి. ఆయన నిజమైన సంఘానికి వేరే అపేక్ష ఏదీ ఉండదు. అన్ని ఆశలకు మిన్నగా, ఆయన ప్రజలు ఆయనను సేవించ వెదకుతారు.

క్రీస్తు ప్రభువు అవతరించకమునుపు, నిరీక్షణ లేనివారమై నిత్య నిరాశను ఎదుర్కొన్నాం. మనకు సహాయం చేయగల ఏ నరుడూ లేడు. నరులచే నిర్మింపబడిందేదీ మనలను రక్షించగలిగేది కాదు. విశ్వ విద్యాలయాల విద్యాభ్యాసమంతా, విద్యా కేంద్రాల పాండిత్యమంతా మనం విమోచింపబడే విధానాన్ని తెలియజేయగలిగేవి కాదు. మనకుండే ఒకే ఒక ఎదురుచూడదగిన మార్గం దైవికమైన జోక్యం.

అప్పుడు, మన దైవికమైన రక్షకుడుగా దేవుడు క్రీస్తును ఈ లోకానికి పంపాడు. ఆయన దేవత్వంలో రెండవ వ్యక్తియై ఉన్నా, పరిపూర్ణమైన నరరూపు దాల్చాడు. నిత్యత్వంలో దేవుడుగా ఉన్న తన మహిమ విడిచి, మన అందరికొరకు మరణం రుచి చూచినట్టు మనలో ఒకనివంటి వాడయ్యాడు (హెబ్రీ. 2:9). నిస్వార్థంగా పరలోకపు మహిమైశ్వర్యాన్ని ప్రక్కన ఉంచి, భూలోకంలోని చిన్నబుచ్చు పరిస్థితులలోనికి ఆయన ప్రవేశించాడు. ఆయన ఎంతగా మానవ మాత్రుడయ్యాడంటే, మనం శ్రమపడే అన్ని విధాలా ఆయన శ్రమపడ్డాడు మరియు మనమందరం ఎలా మరణానికి లోనైనవారమో ఆయన కూడా మరణానికి లోనయ్యాడు. ఆయన, మన ఎదుట పరిపూర్ణమైన జీవితాన్ని ప్రదర్శించ డానికిని, మరియు తన ప్రాణాన్ని మనకొరకు పాప పరిహారార్థ బలిగా పెట్టడానికిని యిదంతా జరిగించాడు. మన పాప దోషం ఒక రుణాన్ని చేసింది – దైవికమైన దేవుని కుమారుని యొక్క పాపరహిత జీవితం మాత్రమే చెల్లించగలదు.

ఆయన ఈ భూమిమీద ఒక్క క్షణం కూడా ఉండనవసరం లేదు కాని ఆయన మనలను ప్రేమించి ఆపదనుండి తప్పించగోరి ఆయన వచ్చాడు. ఆయన ఒక్క అసౌకర్యాన్ని గాని బాధను గాని అనుభవించనవసరం లేదు, కాని మనలను రక్షించడానికి గాను సిలువ మరణంయొక్క ఊహాతీతమైన బాధననుభవించాడు. సిలువ మరణం అనుభవిం చమని తన తండ్రికూడా ఆయనను దానియొద్దకు పంపలేదు; అయితే మనకు రక్షణను ప్రసాదించునట్లు ఆయన యిష్టపూర్వకంగానే సిలువ వద్దకు వెళ్లాడు (యోహాను 10:18). మనపట్ల ఆయనకున్న ప్రేమకు దాచబడిన ప్రణాళికలు – వ్యక్తిగతమైన, స్వార్థపరమైన ఏ ప్లాన్స్ లేవు. అందులో ఏ వేషధారణ గాని, తప్పుడు నటనగాని లేదు, అది పవిత్రమైనది నిష్కళంకమైనది.

గనుక మాటలతో చెప్పనలవికానంతగా మనం ప్రభువైన యేసుకు రుణపడియున్నాం. మొదట, మనం ఆయన వద్దనుండి విమోచనం పొందాం: “దేవుని కృపామహదైశ్వర్య

మునుబట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తంవలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ. 1:7). "... వెండి బంగారములవంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింపబడలేదు గాని అమూల్యమైన రక్తముచేత, అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొఱ్ఱెపిల్లవంటి క్రీస్తు రక్తముచేత, విమోచింపబడితిరని మీరెరుగుదురు గదా" (1 పేతురు 1:18, 19).

రెండవది, ఆయన వద్దనుండి మనం దానం పొందాం (*endowment*). మన తలాంతులు, మనం కలిగియున్నవి ఆయన ప్రసాదించిన దానములే. "... నీకు కలిగినవాటిలో పరునివలన నీవు పొందనిది ఏది? పొందియుండియు పొందనట్టు నీవు అతిశయింపనేల?" (1 కొరింథీ. 4:7).

మూడవది, ఆయన మనకు గుర్తింపదగిన పోలిక నిచ్చాడు. ఆయన రక్తంచేత విమోచింపబడి, తన సేవకొరకు ఆయన కృప ద్వారా ఈవులను పొంది, మనం ఆయన గృహనిర్వాహకులమై యున్నాం. మనం సంపూర్ణంగా ఆయనకు చెందినవారమైయున్నాం. మనకు కలిగినది ఏదీ మన సొంతమైనట్టు మనం చెప్పుకోం. మన తలవెంద్రుకలనుండి, మన పాదములవరకు ఆయన సొత్తైయున్నాం. మనకు ఒకే కోరిక ఆయన్ను సేవించడం. మన కొరకు ఆయన ఏమి చేశాడో దాన్నిబట్టి మనకు వేరే గత్యంతరం లేదు.

---

మనం జీవించడానికి పిలువబడిన జీవితం,
మనకు ఉన్న పని, మనం ప్రకటించే
సందేశం, సేవకత్వంయొక్క తత్వాన్ని
ప్రదర్శిస్తుంది.

---

అమెరికన్ సివిల్ వార్‌కు కొంచెం ముందుగా వేలం వేయబడడానికి సిద్ధంగా ఉన్న బానిస పిల్లయొక్క కథ చెప్పబడింది. ఆ పిల్ల లేట్ టీన్స్‌లో (అంటే పదిహేడు – పందొమ్మిది సంవత్సరాల మధ్య కాలంలో) ఉంది. ఇతర పరిస్థితుల క్రింద, జీవించాలనే అపేక్ష కలిగియుండేదే. మరియు ఆనందదాయకమైన ప్రయాణం సాగించడానికి భవిషత్ జీవితంలో ప్రవేశించియుండేదే. ఏదియేలాగున్నా, ఆమె ఒక బానిస, మరియు తన ఆత్మయొక్క నిరాశచెందిన కోర్కెలు ఆమె కళ్లలో స్పష్టంగా మెదులుతున్నాయి. తన యాజమాన్యంకొరకు వేలం పాడడానికి వేచియున్నవారిని ఒకసారి తేరిచూచి, తన జీవితానికి ఎలాటి భవిష్యత్తు ఉండబోతుందో ఆలోచించడానికి భయముచేత వణకిపోతుంది. త్వరలోనే వేలం పాట వేశేవాని కేక బిగ్గరగా వేలం పాడేవారిని పిలిచింది. పాట పైకి, పైకి పోయింది. చివరిగా పాట ఆగిపోయింది. జనం వేలం వేసేవాడి చివరి మాటకొరకు వేచి నిశబ్దంగా ఉన్నారు, భయంకరమైన ఎముకలు కొంగరపోయే కడమాటగా, "అమ్మివేయబడింది!" అని వినిపించింది. ఆ మాట ఆ యువతిని తన వెర్రి చూపునుండి కదిల్చివేసింది. తన్ను తన సొత్తుగా క్లెయిమ్ చేయ ముందుకు వచ్చేదెవరో చూడడానికి ఆ జనసమూహం మధ్య ఆమె కండ్లు తిరుగనారంభించాయి. ఒక మధ్య వయస్కుడు ఆ జనంలోనుండి నెట్టుకొంటూ ముందుకు రాసాగాడు. అతడు ఆ ప్రక్కకు

వచ్చి ఆ వేలం సొమ్మును చెల్లించాడు. అప్పుడతడు తిరిగి ఆమె వైపు వెళ్లాడు. ఆమెను చేతితో పట్టుకొని, ఆ జన సమూహంనుండి ఆమెను వెలుపలికి తోడుకొనిపోయాడు. ఆమెతో ఏ మాటా పలుకు లేకుండ, అతడొక కాగితం తీసికొని, "ఈ రోజున, నేను నిన్ను కొన్నాను, నేను నీకు స్వాతంత్ర్యమిస్తున్నాను" అని దానికి అడ్డంగా వ్రాసి ఆ కాగితానికి అడుగు భాగాన తన సంతకం చేసి స్వాతంత్ర్యానికి సంబంధించిన ఆ డాక్యుమెంట్ ఆ యువతి చేతికిచ్చాడు. స్వాధీనపరచుకొని ఉద్వేగంతో తన చేతులు దేహం వణకిపోతూ, ఆ కాగితాన్ని తన రొమ్మునకు గట్టిగా కౌగలించుకొని, అది నిజమా కలయా అని ఆశ్చర్యపోతుంది. ఏమి జరిగిందో నిజంగా ఆమె గ్రహించిన తరువాత, ఆమె అతని కాళ్లమీద పడి, "అయ్యా, నేను ఎల్లకాలం – సంతోషంగా, యిష్టపూర్వకంగా, స్వతంత్రంగా నీ దాసినైయుంటాను" అని చెప్పింది.

ఆమెయొక్క రూపచిత్రమే సంఘంయొక్క రూపచిత్రం కూడా. మనం పాపమునకు బానిసలమైయుండి అపవాది బంధకాలయొక్క హద్దుల్లో చెడు జీవితాలకు నియమింపబడి, వాని దుష్ట కోర్కెలు, ఆశలచేత నడిపించబడ్డాం. అయితే ప్రభువైన యేసు తన స్వరక్తంతో కొని, మనకు స్వాతంత్ర్యాన్ని ప్రకటించాడు. నేడు మనం ఆయనకొరకు జీవిస్తున్నాం. మనం ఆయన పాదములమీద పడి, మనకొరకు ఆయన చేసిన దానినిబట్టి మృతినొందని ప్రేమ అభినందనలతో మన నమ్మకత్వాన్ని ఆయనకు కుదువపెట్టాం.

క్రీస్తుకు సేవకుడైయుండగోరని ఏ క్రైస్తవుడైనా, తాను క్రీస్తుకు ఏమి రుణపడియున్నాడో అతడు యోచింపలేదనే చెప్పాలి. ఆయన లేకుండ మనం ఏమి లేనివారమే. నీ మనస్సులో ఒక సున్న గీసుకో. సున్నామీద సున్నా పెడుతూ భూమికంటె పెద్ద సున్నాను చేయి. క్రీస్తు లేకుంటే జీవితం ఎలాగుంటుందో ఆ సున్నా ఉదహరిస్తుంది! క్రీస్తు ప్రభువు లేకుంటే మనం ఏమీ లేని దానికంటె తక్కువ! ప్రభువు మనకేమి చేశారో అనే గ్రహింపు అనుదినం సేవ చేయడంలో మన కృతజ్ఞత ఆయనపట్ల వ్యక్తపరచినట్లౌతుంది.

## చేసి చూపడంలో

మూడవది, క్రీస్తు సంఘమైన మనం, చేసి చూపడంలో క్రీస్తు సేవకులమై ఉన్నాం. మనం జీవించడానికి పిలువబడిన జీవితం, మనకున్న పని, మనం ప్రకటించే సందేశం సేవకత్వపు స్వభావాన్ని ప్రతిఫలింపజేయాలి.

సేవకత్వం అనేది ఎల్లవేళల క్రైస్తవుని హృదయంలో ఉండాలి. ఇది నిజం ఎందుకంటె క్రైస్తవుని జీవితం, "క్రీస్తు – మనయందు " అనే జీవితమే, మరియు లోకం ఎన్నడూ చూడనంత అతి గొప్ప సేవకుడు క్రీస్తు. పౌలు యిలా వ్రాశాడు, "నేను క్రీస్తుతో కూడ సిలువవేయబడి యున్నాను, ఇకను జీవించునది నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అప్పగించుకొనిన దేవుని కుమారునియందలి విశ్వాసమువలన జీవించుచున్నాను" (గలతీ. 2:20). అది వాస్తవమైయుండగా, పౌలు సేవకుని జీవితం జీవించినందుకు ఆశ్చర్యపడనక్కరలేదు; అతడు స్వార్థం లేనివాడు, త్యాగ పూరితుడు, తనకనే దానిమీద

భౌతిక ఆశలేనివాడు. “క్రీస్తుయేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగి యుండుడి” అని మనకు వ్రాశాడు (ఫిలిప్పీ. 2:5). అతని హెచ్చరికననుసరించి, క్రీస్తుకు కలిగిన మనస్సుతో మనం జీవించినట్టయితే, మనం యితరులను గూర్చి ఆలోచన చేస్తూ, యితరులకొరకు జీవిస్తాం:

> ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపము ధరించుకొని, తన్ను తానే రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్ను తాను తగ్గించుకొనెను (ఫిలిప్పీ. 2:6–8).

క్రీస్తుయొక్క మనస్సు తన్ను తాను తగ్గించుకునే మనస్సు. ఆయన తన పరలోకపు మహిమను ప్రక్కనపెట్టాడు, తన సొంత సృష్టియైన మానవ రక్షణకొరకు దాసుని రూపు దాల్చి, మానవ రక్షణకొరకు సిలువ మరణానికి తన్ను తాను లోబరచుకొన్నాడు. మనం ఆయన మనస్సుతో జీవించినట్లయితే, మనుష్యులకు సేవచేసే పాత్ర గాక మరిక దేనిని మనం వహించం.

క్రీస్తు ప్రభువు తన జనులకు అప్పగించిన పనిని సేవకత్వంతో గాక అమలు చేసే వీలుండదు. పరిమితియైన ఉత్తరువుతో ప్రభువైన యేసు తన శిష్యులను పంపినప్పుడు, “ఉచితముగా పొందితిరి ఉచితముగా ఇయ్యుడి” అని ఆయన వారికి ఆజ్ఞాపించాడు (మత్తయి 10:8). ఆయన సార్వత్రికమైన కడపటి ఉత్తరువు జారీచేసినప్పుడు, సేవకత్వం అవసరమని ఆయన తన శిష్యులకు తెలియజేశాడు: “–మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి” (మార్కు 16:15). ఈ ఆజ్ఞను అనుసరించాలంటే, జనులను, ఆస్తులను, మనకు యిష్టమైన నాగరికతలను, మనలో ఎక్కువమంది వదలుకొని పోవలసియుంటుంది; మరియు మిగిలిన మనం మన సొంత ఖర్చులకు ఉపయోగించుకొనే డబ్బును వెళ్లేవారిని పంపడానికి త్యాగ పూరితంగా యివ్వాలి. అలాగున వెళ్లేవారు, పంపేవారు కూడా సేవకులయొక్క పాత్రను నెరవేర్చుతున్నారు. ఆస్తిమంతుడవ్వడానికి మిషన్ ఫీల్డ్‌కు వెళ్లేవాడు ఎవడు ఉండడు, ధనవంతుడు కాగోరి ఎవడును యివ్వడు. వారు చేసేది క్రీస్తు సేవకులుగా చేస్తారు.

మనం ప్రకటించే సందేశం మనది కాదు. మనం ఉత్తరం వ్రాయం, క్రీస్తు ప్రభువు వ్రాసిన ఉత్తరాన్ని అందించే ప్రభుత్వపు సేవకులం మాత్రమే. ఆయన పంపిన సందేశం అపార్థం చేయబడకుండను లేక అస్పష్టంగా లేకుండను మనం చూడవలసియుంటుంది. దాన్ని తిరిగి వ్రాయడానికి మన రాజు వద్దనుండి ఏ విధమైన ఉత్తరువులు లేవు; అది ఉన్నది ఉన్నట్టుగా అందించే బాధ్యత మనకు అప్పగింపబడింది. ఆ సందేశం లేకుండ లోకం నశించిపోయిందని మనకు తెలుసు. అందువలన, కనికరంతోను, దయాపూర్వక మైన ప్రేమతోను సాధ్యమైన ప్రతి మార్గంలో – రచనల ద్వారా, రేడియో మరియు టీ. వీల ద్వారా, ప్రసంగ వేదికల ద్వారా, వ్యక్తిగతమైన సంధింపుల ద్వారా, అనుదిన మాదిరి జీవితాల ద్వారా దాన్ని వెదజల్లాలి. మన సొంత అవకాశాలు, కలల కంటె ముందు

ఆయన సందేశాన్ని పెట్టవలసియుంటుంది. దాని ప్రకటనకొరకు, మన తలాంతులను, మన డబ్బును, మన సమయాన్ని, మన మనస్సులను, మన కాళ్లను, మన చేతులను – అవును, మన హృదయాలనే మనం సమర్పించాలి.

మన రాజు అందరి రాజులకంటె బహు భిన్నమైనవాడు! ఆయన రాజులకు రాజును, ఈ విశ్వానికి సృష్టికర్తయు, పడకుండ నిలుపువాడైయున్నా, ఆయన మన మధ్య దాసుడుగా జీవించాడు. ప్రభురాత్రి భోజన సమయంలో, ప్రభువు తన శిష్యుల కాళ్లను కడగడంలో నుండి ఈ సత్యము ప్రత్యేకమైన రీతిలో ప్రకాశిస్తుంది (యోహాను 13:1–16). ఒక భూరాజు మన మధ్యకు వచ్చినప్పుడు, జనులు ఆయనకు దండ ప్రమాణం చేసి, ఆయనను ముట్టుకొనజూస్తారు. పోపు తన ప్రజల మధ్యకు వచ్చినప్పుడు, వారు ఆయన ముందు మోకాళ్లూని, అతని చేతిని ముద్దు పెట్టుకోజూస్తారు. ఏదియెలాగున్నా, క్రీస్తు ప్రభువు, మరణించడానికి ముందు రాత్రి, తన శిష్యులతో ఉన్నప్పుడు, పళ్లెములో నీళ్లుపోసికొని ఆయన వారి పాదములు కడిగాడు.

ఆయన ఎందుకు ఆ పని చేశాడు? ఆయన చేయవలసివచ్చికాదు లేదా ఎవడు చేయనందున కూడా కాదు. ప్రత్యక్షమైన ఉదాహరణ తన శిష్యుల ముందర విలువైనదిగా ఉంటుందని కాదు. ఆయన ఎవరైయున్నారో అందుకు ఆ పని జరిగించాడు – ఆయన దేవుని కుమారుడు మనుష్యుల దాసుడు. ఆయన దాసుని స్వరూపం దాల్చాడు, దాసుడుగా జీవించాడు, మరియు దాసుడుగానే మృతినొందాడు. నడవడం, భోజనం చేయడం ఎలా సహజమైయుందో, యితరులకు సేవ చేయడం ఆయనకు అంత సహజంగా ఉంది. మనం ఏమైయున్నామో అందునుబట్టి, ఆయన తన అనుచరులను అదే రకమైన జీవితానికి పిలుస్తున్నాడు:

> బోధకుడనియు ప్రభువనియు మీరు నన్ను పిలుచుచున్నారు; నేను బోధకుడను ప్రభువును గనుక మీరిట్లు పిలుచుట న్యాయమే. కాబట్టి ప్రభువును బోధకుడనైన నేను మీ పాదములు కడిగిన యెడల మీరును ఒకరి పాదములను ఒకరు కడుగవలసినదే. నేను మీకు చేసిన ప్రకారము మీరును చేయవలెనని మీకు మాదిరిగా ఈలాగు చేసితిని. దాసుడు తన యజమానునికంటె గొప్పవాడు కాడు, పంపబడినవాడు తన్ను పంపినవానికంటె గొప్పవాడు కాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను (యోహాను 13:13–16).

ప్రభువైన యేసు నడిచినట్టు మనమును నడువవలసియుంది. క్రైస్తవుని జీవితం, పని, సందేశాల్లోనికి సేవకత్వం ఎంతగా అల్లిక చేయబడిందంటే, యితరులకు సేవ చేయడం మీద మన మనస్సులను కేంద్రీకరించకుండ యథార్థమైన క్రైస్తవ జీవితాన్ని జీవించలేం.

దాసునియొక్క జీవితాన్ని నీవు ఎలా జీవించాలని ఆశ్చర్యపోతుంటే, చేయుమని క్రీస్తు ప్రభువు నిన్ను అడిగిన దానిని చేయి. దాసుడుగా ఉండకుండ నీవు ఆయన పనిని చేయలేవని నీవు కనుగొంటావు. ఆయన కోరిన విధంగా యితరులకు నీవాయన సువార్తను సేవకుడవుగా లేక దాసుడవుగా ఉండకుండ చేయలేవు; దాసుడవుగా ఉండకుండ ఆయన చెప్పిన విధంగా పేదలను లక్ష్యపెట్టలేవు; దాసుని హృదయం లేకుండ ఆయన నీకు

అప్పగించిన పనిని నీవు నెరవేర్చలేవు.

## ముగింపు

సంఘము క్రీస్తు ప్రభువుయొక్క దాసులచే నిర్మించబడిందని క్రొత్త నిబంధన స్పష్టం చేస్తోంది. మనం డెసిగ్నేషన్‌లోను, కోర్కెలోను, ప్రత్యక్షంగా ప్రదర్శించడంలోను దాసులమైయున్నాం. సిలువ వద్ద భూమి సమతలంగా చేయబడింది. ఒక దాసునిపై మరియొక దాసుడు హెచ్చింపబడలేదు, లేక ఒక దాసుడు మరియొకని క్రింద నిలువబడలేదు. మనమందరం కేవలం సేవకులమే.

తానొక ఓడలో సముద్రాన్ని దాటుతున్న విషయాన్ని క్లోవిస్ ఛాపెల్ చెప్పాడు. అలాటి ప్రయాణం చేయడం అతనికి అదే తొలిసారియట, మరియు ఆ ప్రయాణం తనకు మించినది. అతడు సముద్రపు జబ్బు ఎంతగా పడ్డాడంటే, అతడు కనీసం నిలువలేక పోయాడు. అతడు నిదురించే చోటు పై బంక్ అట, ఆ పై బంక్‌లో ఉండడం అతనికి కుదరలేదట. తాను చనిపోబోతున్నట్టు అతడు తలంచాడట! తన బంక్ క్రింద బంక్ వాడు అతనికి పూర్తిగా తెలియనివాడైనా, తానెంత జబ్బుపడ్డాడో చూచి కనికరపడ్డాడు. గాలి పీల్చి వదలడం ఎంత సహజమో కనికరం చూపడం అతనికి అంత సహజమైన కారణాన స్థలాలు మార్చుకుందామని అతడు సలహా యిచ్చాడట. అటు తరువాత ఒక నర్స్ రోగిని పరామర్శించునట్టు అతడు యితనికి సేవచేయ నారంభించాడట. ఛాపెల్‌నుండి ఎలాటి విన్నపం జరుగకపోయినా, అతని అవసరతలను గూర్చి యితడు శ్రద్ధతో పట్టించుకున్నాడట. ఆ వ్యక్తియొక్క జీవిత విధానాన్నిబట్టి మిస్టర్ ఛాపెల్ సంవత్సరాల తరబడి అతన్ని జ్ఞాపకం ఉంచుకున్నాడట. దాసుడు ఆలోచించినట్టు అతడు ఆలోచిస్తూ ఉండియుండాలి, ఆ విధంగా, అతడెక్కడ ఉన్నా, ఇంటిలోనైనా విదేశంలోనైనా అతడు సేవకుడుగా జీవించాడట.

క్రీస్తుయొక్క అనుచరులకు సేవచేయడం అనేది తల దువ్వుకున్నంత లేక నడుచునంత సహజం, ఒక గ్లాసు నీళ్లు త్రాగునంత, లేక భోజనం చేయునంత సహజమైపోవాలి. అహం కేంద్రంగా ఉన్న దానినుండి, కుమారుడు కేంద్రమయ్యేలా మన జీవితాలు మారిపోవాలి, దానికి అర్థం ఒకే ఒకటైయుండాలి – సేవకత్వం.

పాపులకు క్రీస్తుయొక్క ఆహ్వానం రక్షణకు సేవకత్వానికి నిలిచియుంది. ఆయన మనతో “రండి” (మత్తయి 11:28, 29) మరియు “వెళ్లండి” (మత్తయి 28:19, 20) అని అంటాడు. తన వద్దకు వచ్చువానినైనా ఆయన చేర్చుకుంటాడు, అయితే తన వద్దకు ఎలా వస్తాడో అదే స్థితిలో ఆయన వానిని ఉండనీయడు. మనలను పాపులుగా ఆయన చేర్చుకుంటాడు, కాని మనుష్యులకు దాసులుగా ఆయన మన రూపాలను మార్చుతాడు. గనుక, ఆయన నిజమైన సంఘం, దాసునియొక్క దాసులతో నిర్మింపబడింది.

నీవు క్రీస్తు ప్రభువు యొక్క దాసుడవా?

## స్టడీ మరియు చర్చకొరకైన ప్రశ్నలు

1. క్లుప్తంగా "దాసుడు" అనేదాన్ని నిర్వచించు.
2. "మనము స్వతంత్రులమే అయినను క్రీస్తు బానిసలం" అనే ప్రతిపాదనను చర్చించు.
3. క్రీస్తు ప్రకారం సేవకత్వం ఎలా గొప్పతనానికి నడిపిస్తుందో వివరించు (మత్తయి 20:25, 26).
4. "నీతికి దాసుడు" అంటే అర్థమేమి?
5. క్రీస్తుకు మనం ఎందుకు చెందినవారం?
6. క్రీస్తునందలి భయముతో ఒకరికొకరు "లోబడి" యుండుడంటే అర్థమేమి?
7. భోజనంవలన ఒకడు తన సహోదరుని ఎలా నశింపజేయగలడు?
8. "సహోదర ప్రేమతో ఒకరికొకరు అర్పింపబడి" యుండుడంటే అర్థమేమి?
9. సంఘము ఎందుకు క్రీస్తు సేవకులై యుండగోరాలి?
10. ఏ మూడు విధాలుగా మనం క్రీస్తుకు రుణపడియున్నాం?
11. క్రైస్తవ జీవితం, క్రీస్తు – మనయందున్న జీవితం – అనేదాన్ని వివరించు.
12. తన్ను తాను రిక్తునిగా చేసికొనే మనస్సు ఏది?
13. సేవకత్వం లేకుండ ప్రభువు మనకిచ్చిన పనిని అమలుపరచగలమా?
14. ప్రభువు తన శిష్యుల పాదములను కడిగినప్పుడు ఆయన ఉపదేశించ నుద్దేశించినదేమి?
15. "సిలువ క్రింద భాగమున భూమి సమతలం చేయబడింది" అనే ప్రయోగం యొక్క ఉద్దేశమేమి?